క్లుప్తంగా

'నాణ్యతతో చేపడుతున్నాం'

ఖానాపూర్: మండలంలోని రాజుర గ్రామంలో రూ.20 లక్షలతో చేపట్టిన సీసీ రోడ్డు పనులకు సర్పంచ్ చిన్నం లావణ్య సోమవారం ప్రారంభించారు. ప్రజలు ఇబ్బందులు పడకుండా కాలనీల్లో సీసీ రోడ్ల పనులను నాణ్యతతో చేపడుతున్నామని వారు పేర్కొన్నారు. రవికుమార్, కారోబార్ రాజేశ్వర్ తదితరులు ఉన్నారు.

5జీ సేవలు ప్రారంభం

నిర్మల్‌టౌన్: జిల్లా కేంద్రంలో జియో 5జీ సేవలను డీఎస్పీ జీవన్‌రెడ్డి సోమవారం ప్రారంభించారు. ఇంటర్నెట్ వినియోగం రోజురోజుకు పెరుగుతుందని.. దీనికి అనుగుణంగా జియో 5జీ సేవలు ప్రారంభించడం అభినందనీయమ ని అన్నారు. యువత ఇంటర్నెట్‌ను స ద్వినియోగం చేసుకొని మంచి భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో జేసీఎం తుజేశ్వర్, డిస్ట్రిబ్యూటర్ నరాల కల్యాణ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రహరీ పనులకు భూమిపూజ



పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి

కుభీర్: మండలంలోని నిగ్వా ఉన్నత పాఠశాల ప్రహరీ పనులకు సోమవారం ఎమ్మెల్యే జి.విఠల్‌రెడ్డి భూమిపూజ చేశారు. అనంతరం ఇటీవల నిర్మించిన మున్నూరుకాపు సంఘం భవనాన్ని ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ కలిసికట్టుగా ఉంటే గ్రామంలో మరింత అభివృద్ధి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సర్పంచ్ లక్ష్మి, ఎంపీటీసీ దేవిదాస్, బాసర జెడ్పీటీసీ వసంతరమేశ్, బీఆర్‌ఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి రాజేశ్వర్, పిరాజీ, ఎస్.వివేక్, గంగారావ్, రాజు తదితరులు ఉన్నారు.

అందుబాటులో యూరియా

లోకేశ్వరం: మండల కేంద్రంలోని పీఏసీఎస్ కార్యాలయంలో అందుబాటులో యూరియా ఉందని పీఏసీఎస్ చైర్మన్ రత్నాకర్‌రావు ఒక ప్రకటనలో తెలిపారు. బస్తా ధర రూ.270 ఉందని.. ఆసక్తి కల్గిన రైతులు తమ ఆధార్, పట్టాదార్ పాస్‌పుస్తకం జిరాక్స్‌లతో కార్యాలయానికి రావాలని కోరారు.

పాఠశాలలు పరిశీలన



విద్యార్థినితో పాఠం చదివిస్తున్న అధికారులు

కుభీర్: మండలంలోని పల్సి, సొనారి, మాలేగాం, నిగ్వా పాఠశాలలను జిల్లా అధికారులు సోమవారం తనిఖీ చేశారు. పారిశుధ్య పరిశీలన, సామర్థ్యాల పెంపుదల, ఎఫ్‌ఎల్‌ఎస్ అమలవుతున్న తీరు పరిశీలించారు. ఈ సందర్భంగా అభ్యాస దీపికలను ప్రాక్టీస్ చేయించడం, గ్రూపుల వారీగా వారంతపు కృత్యాలు నిర్వహించాలని, ప్రాక్టీస్ పేపర్ల మూల్యాంకనం చేసి సందేహాలు నివృత్తి చేయాలని సూచించారు. జిల్లా నోడల్ అధికారి నర్సయ్య, జిల్లా సెక్టోరియల్ అధికారి ప్రవీణ్, సీఆర్పీ గంగాధర్, ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

ముగిసిన ధ్వజప్రతిష్ఠాపన



మాట్లాడుతున్న నందిపేట్ మంగిరాములు

లోకేశ్వరం: మండలంలోని గడ్చాంద గ్రామంలో వీరాంజనేయ మందిరం ధ్వజ ప్రతిష్ఠాపన మహోత్సవం సోమవారం ముగిసింది. కార్యక్రమంలో భాగంగా భక్తులను ఉద్దేశించి నందిపేట్ మంగిరాములు మహారాజ్ ప్రవచనాలు అందించారు. శాంతిపాఠం, గోపూజ, గణాంబిక పూజ, రక్షాబంధనం, భూతోచ్ఛాటనం, అఖండ దీపారాధన, అంకురారోపణం నిర్వహించారు. ఉదయం ఆలయంలో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. సర్పంచ్ వెంకట్‌రావు, తదితరులు ఉన్నారు.

కన్కపూర్‌లో విగ్రహ ప్రతిష్ఠాపన



హాజరైన వివిధ ప్రాంతాల స్వాములు

లోకేశ్వరం: మండలంలోని కన్కపూర్ బ్రహ్మేశ్వరాలయం వద్ద నిర్వహిస్తున్న సత్యానంద సరస్వతి విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమం సోమవారం ముగిసింది. ఈ వేడుకకు నందిపేట్ మంగిరాములు మహరాజ్, ఉజ్జయిని స్వామిజీ ఆనంద సరస్వతి స్వామిజీ, హోండా నాగనాథ్ మహారాష్ట్ర, ఒడిశా బాబా, కందకుర్తి హరిదాస్ స్వామిజీ, మెట్‌పల్లి లక్ష్మణస్వామిజీ హాజరై పూజలు చేశారు. విద్యార్థుల నృత్యాలు అలరించాయి. అనంతరం వీడీసీ ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం చేశారు. బీజేపీ నియోజకవర్గ నాయకులు రామారావుపటేల్, సర్పంచ్‌లు నరేశ్, విఠల్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

ద్రవ రూపంలో యూరియా

- మార్కెట్‌లో తక్కువ ధరకే లభ్యం
- బస్తా యూరియా అరలీటర్‌లో..
- ఆసక్తి కనబరుస్తున్న రైతులు
- గ్రామాల్లో అవగాహన కల్పిస్తున్న వ్యవసాయాధికారులు



సుంక్లిలో అవగాహన కల్పిస్తున్న వ్యవసాయాధికారులు



పొలంలో నానో యూరియా పిచికారీ చేస్తున్న రైతు

భైంసారూరల్: యూరియా అనగా అందరికీ బస్తాల్లో ఉండే తెల్లటి గుళికలే గుర్తుకొస్తాయి. దీన్ని చల్లాలంటే పొలం వరకు మోసుకెళ్లాలి. తడిస్తే కరిగిపోతుంది కాబట్టి కొన్న తర్వాత చేను వద్దకు జాగ్రత్తగా తీసుకెళ్లాలి. కాని ఇలాంటి ఇబ్బందుల్లేకుండా ప్రస్తుతం మార్కెట్‌లోకి నానో యూరియా (ద్రవరూపంలో ఉండేది) అందుబాటులోకి వచ్చింది. లిక్విడ్ యూరియాను నీటిలో కలిపి పంటపై పిచికారీ చేస్తే సరిపోతుంది. అరలీటర్ బాటిల్‌లో ఉన్న నానో యూరియా.. ఒక బస్తా గుళికలు కల్గిన యూరియాతో సమానం.

గతేడాది మార్కెట్‌లోకి..

సకాలంలో పంటకు యూరియా వేయాలని రైతులు.. కొనుగోలు కేంద్రాల వద్ద క్యూలైన్లలో నిల్చుని రైతులు ఇబ్బందులు పడుతుంటారు. రైతుల అవస్థలను దృష్టిలో ఉంచుకొని ఘన రూపంలో ఉండే యూరియాకు ప్రత్యామ్నాయంగా ఇండియన్ ఫార్మర్స్ ఫెర్టిలైజర్స్ కోఆపరేటివ్ సంస్థ గతేడాది ద్రవరూపంలో యూరియాను మార్కెట్లోకి విడుదల చేసింది. దీనిని ప్రభుత్వరంగ సంస్థ ద్వారా మార్కెట్‌లో విక్రయిస్తున్నారు.

డివిజన్ వ్యాప్తంగా అవగాహన..

నానోయూరియా వినియోగంపై భైంసా డివిజన్ వ్యాప్తంగా వ్యవసాయాధికారులు రైతులకు అవగాహన కల్పిస్తున్నారు. రోజుకో గ్రామానికి వెళ్లి రైతులను కలిసి మాట్లాడుతున్నారు. ద్రవ(స్ప్రే) రూపంలో ఉన్న యూరియా మొక్కజొన్న, వరి పొలాలకు దీనిని ఎలా ఉపయోగించాలో వివరిస్తున్నారు.

ప్రయోజనాలివీ..

నానోయూరియా పర్యావరణానికి సురక్షితమైనది. వృక్ష,జంతువులకు విషపూరితం కాదు. పంట దిగుబడి పెరిగి కాలుష్యం తగ్గుతుంది. విత్తనం మొలకెత్తిన 30 రోజుల తర్వాత ఒకసారి, పుష్పించే వారం రోజుల ముందు మరోసారి పిచికారీ చేయాలి. లీటర్ నీటిలో 4 మిల్లీలీటర్ల నానో యూరియాను కలిపి పిచికారీ చేయాలి. దీంతో నత్రజని నేరుగా మొక్కలోతులోకి చొచ్చుకుపోతుంది.

నానో యూరియాలో సరాసరి 1.5 శాతం నత్రజని, 1 శాతం పోటాషియం, 0.5 శాతం కాల్షియం, 0.2 శాతం పాస్పరస్, 0.2 శాతం మెగ్నీషియం, 0.1 శాతం సల్ఫర్ ఉంటాయి. పంటల ఎదుగుదలను బట్టి లీటర్ నీటిలో రెండు లేదా నాలుగు మిల్లీమీటర్ల నానోయూరియా కలిపి పంట ఆకులపై పిచికారీ చేయాలి. ఎకరం వరికి 500 గ్రాముల నానో యూరియా రెండుసార్లు పిచికారీ చేస్తే సరిపోతుందని వ్యవసాయాధికారులు పేర్కొంటున్నారు.

ఎకరానికి అర లీటర్ నానో యూరియా..

ప్రస్తుతం మార్కెట్లో బస్తా యూరియా ధర రూ.270 నుంచి 300 వరకు విక్రయిస్తున్నారు. డిమాండ్‌ను బట్టి కొందరు ఎరువుల దుకాణాల వారు ఎక్కువ ధరకు అమ్ముతున్నారు. బస్తాకు సమానమైన అర లీటర్ నానో యూరియా ధర రూ.140 నుంచి 200 వరకు ధర ఉంది. ఇది ఎకరానికి సరిపోతుంది. గుళికల రూపంలో ఉన్న యూరియా ప్రభావం మొక్కపై రెండు లేదా మూడు రోజులు మాత్రమే ఉంటుంది. కానీ నానో యూరియా ఎనిమిది రోజుల పాటు ప్రభావం చూపుతుంది. తరలించేందుకు ఇబ్బంది లేకుండా జేబులు, కవర్లు, బ్యాగులో పెట్టుకోవచ్చు. ప్రస్తుతం గ్రామాల్లోని రైతులకు వ్యవసాయాధికారులు నానోయూరియా వాడకంపై అవగాహన కల్పిస్తున్నారు.

అవగాహన కల్పిస్తున్నాం

నానో యూరియా వాడకంపై రైతులకు అవగాహన కల్పిస్తున్నాం. ఘన రూపంలో ఉన్న యూరియా చల్లేందుకు కూలీల అవసరం ఉంటుంది. నానో యూరియా ద్రవరూపంలో దొరుకుతుంది. దీంతో ఖర్చు తక్కువ. ఇతర పురుగుమందులతోపాటు నానో యూరియా కలిపి పంటలపై పిచికారీ చేసుకోవచ్చు. రైతుల సందేహాలను నివృత్తి చేస్తూ కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నాం.

– రాంచందర్, వ్యవసాయ అధికారి, భైంసా

ఎమ్మెల్సీ కవిత జన్మదిన వేడుకలు



మంత్రికి కేక్ తినిపిస్తున్న మున్సిపల్ చైర్మన్ ఈశ్వర్

నిర్మల్‌టౌన్: పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో సోమవారం భారత జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి పాల్గొని కేక్ కట్ చేశారు. ఈసందర్భంగా మంత్రి మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వ వైఫల్యాలను బలంగా ఎండగడుతున్నందుకే ఎమ్మెల్సీ కవితపై కక్ష కట్టారన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ గండ్రత్ ఈశ్వర్, మార్కెట్ కమిటీ చైర్మన్ చిలుక రమణ,బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు రాము, జాగృతి జిల్లా అధ్యక్షుడు లక్ష్మణచారి, కౌన్సిలర్లు అయ్యన్నగారి రాజేందర్, వేణు, తదితరులు పాల్గొన్నారు.

భైంసాటౌన్: పట్టణంలోని ఆర్‌అండ్‌బీ అతిథిగృహం వద్ద బీఆర్‌ఎస్ నాయకులు ఎమ్మెల్సీ కవిత జన్మదిన వేడుకలు నిర్వహించారు. ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి, తదితరులు ఉన్నారు.

కుంటాల: మండల కేంద్రంలో ఎమ్మెల్సీ కవిత జన్మదిన వేడుకలను నిర్వహించారు. బీఆర్‌ఎస్ మండల కన్వీనర్ దత్తాద్రి, గజ్జారాం, లక్ష్మణ్, మహేందర్, బుచ్చన్న, మహేశ్వర్, సంతోష్, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

మధ్యవర్తులు డబ్బులు అడిగితే ఇవ్వొద్దు

- ఖానాపూర్ ఎమ్మెల్యే రేఖానాయక్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రేఖానాయక్

ఖానాపూర్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ప్రవేశపెట్టిన డబుల్‌బెడ్‌రూం ఇళ్లు, దళితబంధు పథకం ఇప్పిస్తామని ఎవరైనా డబ్బులు వసూలు చేస్తే తన దృష్టికి తేవాలని ఎమ్మెల్యే అజ్మీరా రేఖానాయక్ అన్నారు. సోమవారం ఖానాపూర్‌లోని తన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. వసూలు చేసిన వారిలో సొంత పార్టీ నాయకులున్నా వదిలే ప్రసక్తి లేదని హెచ్చరించారు. సొంత జాగాలో ఇంటి నిర్మాణం కోసం రూ.మూడు లక్షలు ఇచ్చే గృహలక్ష్మి పథకం కోసం డబ్బులు అడిగినా తన దృష్టికి తేవాలన్నారు. నియోజకవర్గంలో కొందరు ప్రజలను మోసం చేసేందుకు చూస్తున్నారని.. అటువంటి వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. రాజేందర్, రామునాయక్, రాజగంగన్న, కలీల్, శ్యాం, ప్రదీప్, శోభన్ ఉన్నారు.

భీమ్ దీక్షలు విజయవంతం చేయండి



పోస్టర్ ఆవిష్కరిస్తున్న బీఎస్‌ఐ నాయకులు

సారంగపూర్: ఈనెల 15 నుంచి ఏప్రిల్ 14 వరకు జరిగే భీమ్ దీక్షలను విజయవంతం చేయాలని బీఎస్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి కొంతం మురళీధర్ అన్నారు. ఈ మేరకు మండలకేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద సోమవారం దీక్షకు సంబంధించిన గోడప్రతులను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ ఈనెల 15 నుంచి వరుసగా కాన్షీరాం, అశోక చక్రవర్తి, మహాత్మాజ్యోతిబాపూలే, అంబేద్కర్ జయంతి ఉండటంతో ఈనెలను పవిత్ర మాసంగా భావించి దీక్షలు చేపడుతారని పేర్కొన్నారు. నెలరోజులపాటు సాగే దీక్షలో నిత్యం వ్యాయామం చేస్తూ మద్యం, మాంసాహారాలకు దూరం ఉండాలని సూచించారు. కార్యక్రమంలో అంబేద్కర్ సంఘం మండల ఉపాధ్యక్షుడు నరేశ్, నక్క రాజన్న, మధుకర్, సుచిత్, కల్యాణ్, రమేశ్, సాయన్న, నరేశ్, ప్రకాశ్, తదితరులు ఉన్నారు.

ఇష్టారీతిన పార్కింగ్.. రాకపోకలకు అవస్థలు



ఇబ్బంది పడుతున్న వాహనదారులు

భైంసాటౌన్: పట్టణంలో పలు దుకాణాలు, వ్యాపార సముదాయాలు, ప్రైవేట్ ఆస్పత్రులకు పార్కింగ్ స్థలం లేకపోవడంతో అక్కడికి వచ్చినవారు తమ వాహనాలను రోడ్లపైనే నిలుపుతున్నారు. దీంతో ఇతర వాహనాల రాకపోకలకు ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. నర్సింహనగర్‌కు వెళ్లే రోడ్డులో సోమవారం రాత్రి ట్రాఫిక్ జామ్ కావడంతో వాహనదారులు ఇబ్బందులు ప డ్డారు. దాదాపు అరగంటసేపు వాహనాల రద్దీ నెలకొంది. హాస్పిటల్ లైన్ కావడంతో రోగులు ఆస్పత్రులకు వెళ్లేందుకు ఇబ్బంది పడ్డారు. రోడ్లపై ఇష్టారీతిన వాహనాలు పార్కింగ్ చేయకుండా పోలీసులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

నేడు ఆలయ వార్షికోత్సవం

ఖానాపూర్: పట్టణంలోని శాంతినగర్ కాలనీ శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయ ఎనిమిదో వార్షికోత్సవం మంగళవారం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించనున్నారు. ఉత్సవాల్లో భాగంగా పండితులు చక్రపాణి వాసుదేవాచార్యులు, నరసింహమూర్తి, నాగరాజుశర్మ ఆధ్వర్యంలో స్వస్తి వచనం, రక్షాబంధనం, శాంతిహోమం, ఆలయ బలిహరణం, పంచామృతాభిషేకం, ముత్తయిదువులచే సామూహిక కుంకుమార్చనలు, పూజలు ఉంటాయని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

నేడు అభ్యంతరాలు తెలపాలి



ఖానాపూర్: పట్టణంలోని డబుల్ బెడ్‌రూం ఇళ్ల లబ్ధిదారుల ఎంపికపై ఇటీవల నిర్వహించిన లక్కీ డ్రాలో ఎవరైనా అనర్హులు ఉంటే ప్రజలు తమ అభ్యంతరాలను మంగళవారం తెలియజేయాలని ఖానాపూర్ మున్సిపల్ కమిషనర్ రత్నాకర్‌రావు తెలిపారు. కలెక్టర్ వరుణ్‌రెడ్డి ఆదేశాల మేరకు ఈనెల 14న పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయంతో పాటు మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక గ్రీవెన్స్ సెల్ బాక్స్‌లో అభ్యంతరాలు తెలియజేయాలన్నారు. చిటీపై అనర్హుల పేరు, వివరాలు రాసి బాక్స్‌లో వేయాలని సూచించారు.

శబరిమాత పూజలు

మామడ: మండలంలోని పొన్కల్ గ్రామంలో సో మవారం శబరిమాత పూజలు నిర్వహించారు. ఆధ్యాత్మిక అలవర్చుకొని మాంసం, మద్యానికి దూ రం ఉండాలని బలదస్ మహరాజ్ అన్నారు. వివిధ గ్రామాల భక్తులు హాజరై ప్రత్యేక పూజలు చేశారు.

భీమన్న దేవుని ఉత్సవాలు

కడెం: మండలంలోని ధర్మాజీపేట్ గ్రామంలో భీమన్న దేవుని ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ఐదు రోజుల ఉత్సవాల్లో భాగంగా మూడోరోజైన సోమవారం భీమన్న ప్రతిమలతో గ్రామంలో ఊరేగింపు నిర్వహించారు. పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు.

ఫిర్యాదుల విభాగాన్ని సద్వినియోగం చేసుకోవాలి

ముధోల్: మండల కేంద్రంలో ప్రతి సోమవారం నిర్వహించే ప్రజా ఫిర్యాదుల విభాగాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ శ్యాంసుందర్ అన్నారు. సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల విభాగంలో పలు అర్జీలు సమర్పించగా అధికారులు స్వీకరించారు. సమస్యలు పరిశీలించి వారం రోజుల్లో సమస్య పరిష్కరిస్తామని తహసీల్దార్ పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో సురేశ్‌బాబు, ఎంఈవో మైసాజీ, ఏపీఎం అశోక్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

కుంటాల: తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల విభాగంలో ఒక్క అర్జీ కూడా రాలేదని తహసీల్దార్ కలీం తెలిపారు. ఎంపీడీవో దేవేందర్‌రెడ్డి, ఏవో సోమలింగారెడ్డి, పశువైద్యాధికారి ప్రకాశ్, డీటీ నారాయణ్‌గౌడ్, ఎంపీవో రహీం, ఆర్ఐ విజయ్, ఏపీవో నవీన్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ లక్ష్మివిశారద, భోజన్న తదితరులు పాల్గొన్నారు.

పని ప్రదేశంలో సౌకర్యాలు కల్పించాలి



మాట్లాడుతున్న మహమ్మద్

నర్సాపూర్(జి): ఉపాధిహామీ కూలీలకు పని చేసే ప్రదేశంలో సౌకర్యాలు కల్పించాలని అఖిల భారత ప్రగతిశీల వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి సయ్యద్ మహమ్మద్ అన్నారు. మండలంలోని గొల్లమాడ గ్రామంలో సోమవారం ఆయన ఉపాధి కూలీలతో మాట్లాడారు. రోజుకు రూ.600 కూలీ, సామగ్రి అందించాలన్నారు. పని ప్రదేశంలో తాగునీరు, టెంట్, మెడికల్ కిట్ లేక కార్మికులు అవస్థలు పడుతున్నారని.. అధికారులు సమస్య పరిష్కరించకుంటే ఆందోళన చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు శాంతకుమారి, రేణుక, కూలీలు పాల్గొన్నారు.

అటెన్షన్ ప్లీజ్.. మురుగు తొలగించరూ..



లోకేశ్వరం: మండలంలోని రాయపూర్‌కాండ్లీ గ్రామంలోని ఎస్సీవాడలో మురుగు కాలువలను శుభ్రం చేయకపోవడంతో దుర్గంధం వెదజల్లుతోంది. పిచ్చిమొక్కలు ఏపుగా పెరగడంతో కాల్వలు దోమలకు నిలయంగా మారుతున్నాయి. రోగాల బారిన పడుతున్నామని.. అధికారులు కాలువలను శుభ్రం చేయించాలని స్థానికులు కోరుతున్నారు.

ప్రశ్నించాల్సిన అధికారి: నారాయణ, రాయపూర్‌కాండ్లీ కార్యదర్శి, ఫోన్ 94404 53534

'రావిచెరువు చెక్‌డ్యాంను రక్షించుకుంటాం'



రైతులతో చెక్‌డ్యాం పరిశీలిస్తున్న మాజీ ఎంపీ

పెంబి: నాగాపూర్ రైతులకు బీజేపీ అండగా ఉండి రావిచెరువు చెక్‌డ్యాంను రక్షించుకుంటామని మాజీ ఎంపీ, బీజేపీ నాయకులు రాథోడ్ రమేశ్ అన్నారు. సోమవారం మండలంలోని నాగాపూర్ గ్రామంలో ధ్వంసమైన రావి చెరువు చెక్‌డ్యాంను రైతులతో కలిసి పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ నాగాపూర్ చెక్‌డ్యాంను రూ.2.55కోట్లతో నిర్మించి.. ప్లానింగ్ సరిగా లేదని కూల్చివేయడంతో రైతులు నష్టపోయారని మండిపడ్డారు. గతంలో నిర్మించిన డీపీఆర్‌లు తప్పని చెక్‌డ్యాంను పగులగొట్టడం అధికారుల డొల్లతనానికి నిదర్శనమన్నారు. రావి చెరువు చెక్‌డ్యాంను ధ్వంసం చేసిన అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ రామేశ్వర్‌రెడ్డి, పట్టణాధ్యక్షుడు నాయిని సంతోశ్, తోకల బుచ్చన్న, రవీందర్‌రెడ్డి, లక్ష్మీనారాయణ, రాజు, రాము, శేఖర్, కిషన్, జీవన్, రాజశేఖర్‌రెడ్డి, తదితరలు ఉన్నారు.

చెడు వ్యసనాలకు దూరం ఉండాలి



భక్తులతో మాట్లాడుతున్న పోచ్చారాం మహరాజ్

తానూరు: మండలంలోని భోసి గ్రామంలో లక్ష్మీనారాయణ స్వామి ఆలయంలో వారం రోజులుగా కొనసాగుతున్న అఖండ హరినామ సప్తాహం సోమవారం ముగిసింది. ఉదయం గ్రామంలోని వీధుల్లో పారాయణంతో ఊరేగింపు నిర్వహించారు. ఈ సందర్భంగా కళ్యకీర్తన కార్యక్రమంలో పోచ్చారాం మహరాజ్ పాల్గొని భక్తులకు పలు సూచనలు చేశారు. తులసీమాల ధరించి వార్‌కరిగా మారాలన్నారు. యువత చెడు వ్యసనాలకు దూరం ఉండి తల్లిదండ్రులను మంచిగా చూసుకోవాలన్నారు. అనంతరం ఉట్టి కొట్టి ప్రసాదం పంపిణీ చేశారు. గ్రామ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం చేశారు. ఆలయ కమిటీ సభ్యులు, పాల్గొన్నారు.

స్వచ్ఛభారత్ మిషన్‌పై అవగాహన

నర్సాపూర్(జి): కలెక్టర్ ఆదేశాల మేరకు మండల కేంద్రంలోని రైతువేదికలో మూడు రోజులపాటు నిర్వహించే స్వచ్ఛభారత్ మిషన్(గ్రామీణ)పై అవగాహన సదస్సు కార్యక్రమాన్ని సోమవారం ఎంపీపీ కొండ్ర రేఖరమేశ్ ప్రారంభించారు. ఈసందర్భంగా స్వచ్ఛభారత్ మిషన్ కన్సల్‌టెంట్ అబూజర్, శిక్షకులు ఎల్.గంగాధర్ ఈజీఎస్, సెర్ప్ కార్యకలాపాలు, సఖీ సేవలు, ఉమెన్ చైల్డ్ డెవలప్‌మెంట్ విధులపై అవగాహన కల్పించారు. ఎంపీడీవో వనజ, ఎంపీవో శ్రీనివాస్‌గౌడ్, ఏపీఓ సుగుణ, మండలంలోని సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లు, మహిళా సంఘాల అధ్యక్షులు పాల్గొన్నారు.

పెరిగిన కరువు భత్యం అమలు చేయాలి

లక్ష్మణచాంద: బీడీ కార్మికులకు పెరిగిన కరువు భత్యం అమలు చేయాలని తెలంగాణ ప్రగతిశీల వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.రాజన్న అన్నారు. సోమవారం సోన్ మండలం కడ్తాల్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కరువుభత్యం అమలు చేయాలని కోరుతూ కరపత్రాలను విడుదల చేశారు. సోన్ మండలంలోని కడ్తాల్, బొప్పారం గ్రామాల్లోని బీడీ ఫ్యాక్టరీల యాజమాన్యాలు కార్మికులకు పెరిగిన కరువుభత్యం అమలు చేయాలన్నారు. కార్మికులకు పెరిగిన కరువుభత్యం రూ.9.40 ఏప్రిల్ నుంచి అమలు చేయాలని యాజమాన్యాలను కోరారు. భత్యం అమలు చేయకుంటే యూనియన్ తరఫున ఆందోళనలు చేస్తామన్నారు. కార్యక్రమంలో జయరాం, నర్సయ్య, లింబాద్రి, లక్ష్మి, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

సెల్‌ఫోన్‌తో టైంపాస్





జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణికి జిల్లా నలుమూలల ప్రజలు వస్తుంటారు. తమ గోడు వెల్లబోసుకొని సమస్యలు పరిష్కరించాలని అధికారులను కలిసి వేడుకుంటారు. కాని కొందరు అధికారులు మాత్రం ప్రజావాణికి ఆలస్యంగా వస్తూ ప్రజా సమస్యలు పట్టించుకోకుండా సెల్‌ఫోన్‌తో టైంపాస్ చేస్తున్నారు. దీంతో బాధితులు నిరాశతో వెనుదిరుగుతున్నారు.

- సాక్షి ఫొటోగ్రాఫర్, నిర్మల్